క్లుప్తంగా

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



నింద్రలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నింద్ర: మండల కేంద్రంలోని ముస్లింలు గురువారం మిలాద్ ఉన్ నబీ పండుగ పురస్కరించుకుని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రవక్త అనుసరించిన బాటలో ప్రతి ఒక్కరూ అనుసరించి నడుచుకోవాలన్నారు. మతగురువు ఈ సందర్భంగా ముస్లింలకు ప్రత్యేక నియమాలను సూచించారు. ఈ సందర్భంగా మసీదును విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఆన్‌లైన్ వర్క్‌షాప్‌కు స్పందన

కార్వేటినగరం: ప్రభుత్వ డిగ్రీకళాశాలలో నిర్వహించిన ఆన్‌లైన్ వర్క్‌షాప్‌నకు విశేష స్పందన లభించిందని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో గణితం, కంప్యూటర్ సైన్సు విభాగంపై చెన్నైలోని పాంటెక్ ఈ–లెర్నింగ్‌తో కలిపి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ)పై ఆన్‌లైన్ వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ వర్క్‌షాపులో వెయ్యిమంది విద్యార్థులు, భారతదేశంలోని వివిధ కళాశాలల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారని తెలిపారు. ఇలాంటి ఆన్‌లైన్ వర్క్‌షాపుల వల్ల విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు పెంపొందడమే కాకుండా, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడికి పౌర్ణమి హారతులు



గీతా మందిరంలో సత్యనారాయణ వత్రం నిర్వహిస్తున్న మహిళలు

పుత్తూరు రూరల్: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని గీతామందిరంలో వెలసిన శ్రీకృష్ణ భగవానుడికి గురువారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. గీతా పారాయణం, భజనలు చేశారు. అనంతరం మహిళలు శ్రీకృష్ణ భగవానుడికి పౌర్ణమి హారతులు ఇచ్చారు. రాత్రి పవలింపు సేవా కార్యక్రమం నిర్వహించారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా బాబు



కె.బాబు

పుత్తూరు రూరల్: భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శిగా పుత్తూరుకు చెందిన కె.బాబును నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.జగదీశ్వరనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ నగరి నియోజకవర్గం నుంచి తనకు ప్రాతినిధ్యం కల్పిస్తూ ఇచ్చిన బాధ్యతలకు న్యాయం చేస్తానని తెలిపారు. గతంలోనూ పార్టీ అనుబంధ సంస్థ అయిన మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శిగా, జిల్లా యువ మోర్చా కార్యదర్శిగా, మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

లారీని ఢీకొని వ్యక్తికి గాయాలు

శ్రీరంగరాజపురం: లారీని ఢీకొని ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. ఆరిమాకులపల్లి బీసీ కాలనీకి చెందిన గోవిందయ్య కుమారుడు శేఖర్ (37) కార్వేటినగరం నుంచి స్వగ్రామానికి బైక్‌లో వస్తుండగా చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిలోని పిల్లారికుప్పం క్రాస్ వద్ద లారీని ఢీకొట్టాడు. దీంతో శేఖర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ షెక్షావలి చెప్పారు.

అటవీ సిబ్బందిపై ఫిర్యాదు

కేవీబీపురం: ఫారెస్టు అధికారులు తమపై దాడి చేసి కులం పేరుతో దూషించారని తిమ్మసముద్రం గ్రామంలో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పెరిందేశం గ్రామానికి చెందిన బి.రమేష్, వి.రాజా తిమ్మసముద్రం పంచాయతీలో ఉన్న ఓ ప్రైవేటు సంస్థలో సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆ సంస్థ డెవలప్‌మెంట్ పేరుతో అక్కడ ఉన్న చెత్తాచెదారాలను రిజర్వు ఫారెస్టులో తెలియక వేశారు. దీనిపై ఫారెస్టు అధికారులు వారిని నిలదీశారు. సమాచారం అందుకున్న యజమాని అక్కడికి చేరుకుని అక్కడ ఉన్న వ్యర్థాలను త్వరలోనే తీసివేస్తామని ఫారెస్టు అధికారులకు తెలిపారు. అయితే ఫారెస్టు సిబ్బంది తమపై దురుసుగా ప్రవర్తించడంతో తాము ప్రతిఘటించామని, అయితే వారు తమపై దాడి చేశారన్నారు. అంతటితో ఆగకుండా తమ గ్రామం పేరు చెప్పి తమను కులం పేరుతో దూషించారని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సర్వేజనా ఆరోగ్య సురక్ష

- ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే
- ఇంటింటా వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది
- రేపటి నుంచి వైద్యశిబిరాలు

విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చిన విషయం విదితమే. పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీని మరింత పటిష్టంగా అమలు చేస్తున్నారు. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి పేదల ఇళ్ల ముంగిటకే వైద్యసేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానానికి శ్రీకారం చుట్టిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం దేశచరిత్రలో ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రతి గ్రామంలో, వార్డుల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం మహాయజ్ఞంలా నిర్వహిస్తున్నారు.



మున్సిపల్ చైర్మన్ నీలమేఘం ఇంటి వద్దే రక్తపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది





పద్మావతి నగర్‌లో వృద్ధురాలికి, ఓంశక్తి ఆలయం వద్ద మహిళకు బీపీ చెక్‌చేస్తున్న వైద్యసిబ్బంది

నగరి: ఆరోగ్యమే మహాభాగ్యం.. ఈ నానుడిని ప్రభుత్వం అక్షరాలా నిజం చేస్తోంది. ప్రజల ఆరోగ్య భద్రతకు భరోసా ఇచ్చేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో ‹జగనన్న ఆరోగ్య సురక్ష› సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రతి ఒక్కరికీ పరీక్షలు చేస్తున్నారు. ఈ సర్వేలో క్లస్టర్ పరిధిలో వలంటీర్లతో పాటు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొంటున్నారు. ఎత్తు, బరువు నమోదు చేయడంతో పాటు ఆర్బీఎస్, మలేరియా, డెంగీ, టీబీ, హిమోగ్లోబిన్ వంటి ప్రాథమిక పరీక్షల నిమిత్తం రక్తపరీక్ష, బీపీ నమోదు, పల్స్, ఆక్సిజన్ లెవల్స్ నమోదు చేస్తున్నారు. ఇందులో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రతి రోగికీ ఒక కేస్ షీట్ తయారు చేస్తారు. అందులో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలు, రోగి రక్త నమూనాలు, రోగాల వివరాలు, వారికి అందించిన మందులు, తినాల్సిన, తినకూడని ఆహారం, క్యాల్షియం, ఐరన్ మాత్రలు ఇలా ప్రతి విషయం కూడా నమోదు జరుగుతోంది. 53 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేయనున్నారు. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడిన వారికి నెలకు సరిపడా మందులు అందిస్తున్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ద్వారా వైద్యం అందించనున్నారు.

ఈ నెల 30 నుంచి వైద్య శిబిరాలు..

ఈ నెల 30 నుంచి ముందస్తుగా నిర్ణయించిన తేదీల మేరకు అర్బన్ హెల్త్ సెంటర్లు, విలేజ్ క్లినిక్‌లలో జరిగే వైద్య శిబిరాల్లో ఇద్దరు స్పెషలిస్టులు, ఇద్దరు పీహెచ్‌సీ వైద్యాధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించనున్నారు. రోగులు ఎక్కువగా విచ్చేసే శిబిరాలకు అదనపు వైద్యులను కూడా కేటాయించనున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే వివరాలు

మండలం/మున్సిపాలిటీ	సచివాలయాలు	కుటుంబాలు	సర్వేపూర్తిచేసినవి
నగరి మున్సిపాలిటీ	17	17632	13163
నగరి మండలం	13	11175	8624
పుత్తూరు మున్సిపాలిటీ	14	16263	12262
పుత్తూరు మండలం	10	8185	4699
నింద్ర మండలం	11	9374	4110
విజయపురం మండలం	12	9613	3668
వడమాలపేట మండలం	12	10592	7010

సద్వినియోగం చేసుకోండి..



రాష్ట్రవ్యాప్తంగా ప్రజల ఆరోగ్యంపై సర్వేచేయడం ఇదే ప్రథమం. దేశవ్యాప్తంగా ఎక్కడా జరగలేదు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. క్యాంపుల నిర్వహణ తేదీలు, పాల్గొనాల్సిన వైద్యుల వివరాలు ఇప్పటికే చార్ట్ వేయడం జరిగింది. వైద్యసిబ్బంది సర్వేను కూడా అందుకు అనుగుణంగా పూర్తి చేస్తూ వస్తున్నారు. సర్వే నిర్వహణ సమయంలో పరీక్షలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణులు, బాలింతలు, తగిన బరువులేని పిల్లలు, క్షయ, కుష్ఠు వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

–డాక్టర్ రవిరాజు, జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లా నోడల్ అధికారి

గాలి భానుపై పోలీసులకు ఫిర్యాదు



సీఐ లక్ష్మీనారాయణకు ఫిర్యాదు ఇస్తున్న మున్సిపల్ చైర్మన్ హరి, కౌన్సిలర్ జయలక్ష్మి, నాయకులు

పుత్తూరు రూరల్: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజాను వ్యక్తిగతంగా అసభ్యపదజాలంతో దూషించిన టీడీపీ నగరి ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్‌పై గురువారం పుత్తూరు మున్సిపల్ మహిళా కౌన్సిలర్లు వి.జయలక్ష్మి, కె.రాధ, ఎంపీపీ మునివేలు వేర్వేరుగా సీఐ లక్ష్మీనారాయణకు ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు పేరిట నిరసన కార్య క్రమంలో పాల్గొన్న భానుప్రకాష్ బాధ్యతాయుత పదవిలో ఉన్న మంత్రి రోజాను ఉద్దేశపూర్వకంగా దూషించిన మాటలు సభ్యసమాజం తలదించుకొనేలా ఉన్నాయని అన్నారు. మహిళా ప్రజాప్రతినిధి అన్న గౌరవం లేకుండా అసభ్యంగా మాట్లాడిన ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మహిళలందరూ ఏకమై తగిన రీతిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. అంతకు ముందు పోలీస్ స్టేషన్ ఎదుట వైఎస్సార్‌సీపీ నాయకులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. భానుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి.శంకర్, ఎంపీపీ మునివేలు, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, కౌన్సిలర్లు ఏకాంబరం, బాలాజీ, చిట్టిబాబు, గుణ, సర్పంచ్‌లు మురళీయాదవ్, గోవిందస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శనం, రాంబత్తయ్య, ఈశ్వరయ్య, మునిరత్నం, రాజా, ప్రభు, మురళీరాజు, చిన్నా, మునయ్య, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం



నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోద

పెనుమూరు(కార్వేటినగరం): ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం కోసం పోరాటం చేసిన పొట్టి శ్రీరాములుతో ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రాన్ని విడగొట్టిన ద్రోహి చంద్రబాబును పోల్చడం హాస్యాస్పదంగా ఉందని జీడీనెల్లూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పెనుమూరు మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. డొల్లకంపెనీల పేరుతో ప్రజాధనాన్ని దోచుకున్న దొంగ చంద్రబాబు అన్నారు. అలాంటి వ్యక్తిని రాష్ట్రం కోసం పోరాటాలు చేసి మహానుభావులు, దేవుళ్లతో పాటు పోల్చుకోవడం దారుణమన్నారు. టీడీపీ నాయకులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గానికి రెండు 50 పడకల ఆస్పత్రులు తెచ్చిన ఘనత ఉప ముఖ్యమంత్రిదేనని, అలాగే రెండు పురాతన ఆలయాలను టీటీడీ పరిధిలోకి చేర్చి, టీటీడీ కల్యాణ మండపాల నిర్మాణం, అదేవిధంగా నియోజకవర్గంలో టీటీడీ ద్వారా 85 ఆలయాల నిర్మాణాలను ఏకకాలంలో మంజూరు చేయించిన ఘనత డిప్యూటీ సీఎందే అన్నారు. వెన్నుపోటు రాజకీయాలు చేయడం ఒక్క చంద్రబాబుకే సాధ్యమన్నారు. టీడీపీలో చెత్త రాజకీయాలు చేసే హరిబాబు నాయుడు, కొందరు టీడీపీ నాయకులు డిప్యూటీ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని వారు తీవ్రపరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ





విద్యార్థిని తల్లిదండ్రులతో మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జెల లక్ష్మి, ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి

పెనుమూరు (కార్వేటినగరం): అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి, మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జెల లక్ష్మి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్ చదువుతున్న విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున అన్నివిధాలా ఆదుకుంటామని వారు హామీ ఇచ్చారు. ఒకవేళ ఆ మైనర్ బాలికది హత్య అని తేలితే నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించేలా చూస్తామన్నారు. ఇదే విషయంపై పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడడం జరిగిందని మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జెల లక్ష్మి అన్నారు. విద్యార్థిని మృతిపై రాజకీయాలు తగదని చెప్పారు. అనంతరం జ్ఞానేంద్రరెడ్డి, రాజేష్‌తో కలసి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలతరెడ్డి, గోవిందరెడ్డి, చక్రవర్తినాయుడు, ఐసీడీఎస్ సీడీపీఓ వినుతశ్రీ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శైలజ పాల్గొన్నారు.



సప్తవర్ణ శోభితం

పట్టణ పరిధిలో కొన్ని రోజుల పాటు మధ్యాహ్నం నంచి వర్షం కురవడం పడుతోంది. గురువారం సాయంత్రం కూడా వర్షం పడగా, అలాగే ఆకాశంలో ఏర్పడిన ఇంద్రధనుస్సు అందరినీ ఆకట్టుకుంది. చిన్నారులు ఇంద్రధనుస్సులోని రంగులను చూశారు. –నగరి

ఎంఎస్ స్వామినాథన్ మృతి తీరని లోటు

కార్వేటినగరం: భారత వ్యవసాయ శాస్త్రవేత ఎంఎస్ స్వామినాథన్ మృతి భారతదేశ వ్యవసాయ రంగానికి తీరని లోటని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం డిప్యూటీ సీఎం ఫోన్‌లో సాక్షితో మాట్లాడారు. వ్యవసాయ రంగంలో ఎంఎస్ స్వామినాథన్ హరిత విప్లవాన్ని తీసుకొచ్చి, ప్రపంచంలో ఆకలి, పేదరికాన్ని తగ్గించడంపై దృష్టి సారించిన మహనీయుడు అని కొనియాడారు. హరిత విప్లవ పితామహుడు మృతి చెందడం భారతదేశానికి తీరని లోటన్నారు. వరి, గోధుమ మొదలైన పంటలపై ఆయన జరిపిన విశేష కృషి వల్ల భారతదేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని గుర్తు చేశారు.

అట్టహాసంగా గణేశ్ నిమజ్జనం



తూగుండ్రం గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వినాయకుడి ప్రతిమ

పాలసముద్రం: మండలకేంద్రం పాలసముద్రం బీసీ కాలనీలో వినాయక చవతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహానికి పది రోజులుగా ప్రత్యేక పూజలు చేసి గురువారం కోలాహలంగా నిమజ్జనం చేశారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేక దీపారాధనలు చేశారు. స్వామివారి వద్ద ఉంచిన లడ్డూని గ్రామస్తులు వేలం పాడారు. వేలంపాటలో సుబ్రమణ్యం కుమారుడు చంద్రశేఖర్ రూ.31 వేలు లడ్డూని తీసుకున్నారు. సాయంత్రం ఉభయదారులు కస్తూరమ్మ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ప్రసాదం పంచారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ గణేశ్ నిమజ్జనం చేశారు.

తూగుండ్రంలో..

గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం తూగుండ్రం కల్యాణ మండపం వద్ద గ్రామస్తులు వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. అర్చకుడు శివకుమార్ వేదమంత్రాలు పఠిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పాలసముద్రంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

రత్నంకు నివాళి



నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి: మున్సిపల్ పరిధిలోని కరకంతాపురం దళితవాడకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రత్నం అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి గురువారం రత్నం ఆయన స్వగృహానికి వెళ్లి భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అంత్యక్రియలకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, కౌన్సిలర్ మురుగన్, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్ప రెడ్డి, వెంకటరెడ్డి, బుచ్చిరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అధికారుల అనుమతితోనే గ్రావెల్ తరలింపు



మాట్లాడుతున్న లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయపురం (నగరి): గ్రావెల్ తరలింపులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హస్తం ఉందని పచ్చ పత్రికల్లో వస్తున్న అసత్యపు వార్తలను గ్రావెల్ తరలింపు చేస్తున్న డీకేటీ భూముల లబ్ధిదారులు ఖండించారు. గురువారం వారు మహారాజపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమకు ఇచ్చిన డీకేటీ భూముల్లో మైనింగ్ శాఖ అధికారుల నుంచి అనుమతి తీసుకునే గ్రావెల్ తరలిస్తున్నామని తెలిపారు. గ్రావెల్ తరలింపులో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై సర్పంచ్ సాధామణి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీపై బురద చల్లుతూ కొందరు పని కట్టుకుని విమర్శలు చేస్తున్నారన్నారు. తమ అవసరం కోసం గ్రావెల్ తీసుకున్నా, ప్రభుత్వానికి సీనరేజ్ కట్టే మట్టిని తరలించుకుని భూములు చదును చేసుకుంటున్నామని తెలిపారు. అయితే ప్రతిపక్ష నాయకులు దుర్బుద్ధితో గ్రావెల్ తరలింపులో మంత్రి రోజాకు సంబంధం ఉందని పచ్చపత్రికల్లో కట్టుకథలు అల్లిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ గోపి, నాయకులు శివకుమార్, సురేష్, నిరోషా, హరికృష్ణ, కృష్ణయ్య, పరంధామన్, దిలీప్ కుమార్, రాజగోపాల్, భాస్కర్ రెడ్డి, కుమార్, బాబు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సహస్ర సిద్ధి గణపతి హోమం



విశేషాలంకరణలో సహస్ర సిద్ధి గణపతి

ఏర్పేడు: మండలంలోని మర్రిమంద బీసీ కాలనీలో గురువారం సహస్ర సిద్ధి గణపతి హోమం, పూజలు వేడుకగా జరిగాయి. ఆలయాన్ని నూతనంగా నిర్మించి 11 రోజుల పాటు వివిధ రకాల అభిషేకాలతో విశేషాలంకరణ చేసి పూజలు చేశారు. చివరి రోజు గురువారం 1008 లడ్డూలతో గణపతికి అభిషేకం, హోమం, విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నాగరాజురెడ్డి, మునిరాజా, నాయకులు హేమాద్రి, త్రివిక్రమరావు, గురవారెడ్డి, లోకేష్, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మేల్కొలిపిన దార్శనికుడు జాషువా



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: సమాజంలోని అసమానతలపై తన రచనల ద్వారా ప్రశ్నించి ఆలోచింపజేసిన దార్శనికుడు కవి గుర్రం జాషువా అని విశ్రాంత ఆచార్యుడు గార్లపాటి దామోదర నాయుడు కొనియాడారు. గుర్రం జాషువా జయంతి సందర్భంగా గురువారం అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయలో జాషువా సంస్మరణ పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. చెన్నై జనని సాహితీ సమితి ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, సభాధ్యక్షుడు అవధాని ఆముదాల మురళి మాట్లాడుతూ వివక్షకు గురవుతున్న ప్రజల ఆత్మగౌరవం కోసం తన రచనలతో సమాజాన్ని మేల్కొలిపిన నవయుగ కవి చక్రవర్తి జాషువా అని కొనియాడారు. పుస్తక సంపాదకుడు మన్నవన గంగాధర ప్రసాద్ సమీక్ష చేస్తూ జనని పిలుపు మేరకు మూడు రాష్ట్రాల నుంచి 46 మంది కవులు, రచయితలు జాషువా సాహిత్యంపై పలు అంశాలపై వారి వారి శైలిలో కవితలు, పద్యాలు రాశారని తెలిపారు. ప్రముఖ కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ జీవితంలో ఎన్నో అవమానాలు ఎదురైనా తెలుగు వారికి ఎన్నో ఆణిముత్యాలాంటి రచనలను అందించిన కవి జాషువా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, కవులు, రచయితలు కలువగుంట రామూర్తి, టెంకాయల దామోదరం, వాకా ప్రసాద్, చెంచయ్య నాయుడు, రొద్దా సురేంద్ర, గండుపల్లి గోవిందయ్య, గురుదేవ్, కాంతారావు, సోమశేఖర్, బొగ్గవరపు శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

సాయిబాబాకు పూజలు



సాయిబాబా ఆలయంలో భక్తులు

కార్వేటినగరం: మండలకేంద్రంలోని బాలాజీ కాలనీలో వెలసిన శ్రీ షిరిడీ సాయినాథుని ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని అర్చకులు వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. భక్తులకు ఆలయ అధ్యక్షుడు బాలాజీ చేతుల మీదుగా ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.